# వాంటెడ్

కె.వి. రమణమూర్తి

ప్రొద్దున్నే పేపర్ చూడడం నాకలవాటు. మూడేళ్ళ బట్టి అది నిత్యావసరమై పోయింది. ఎందుకంటే నేను డిగ్రీ పుచ్చుకుని మూడేళ్ళు కావస్తోంది.

ఉదయాన్నే కాఫీ తాగి, కుర్చీలో కూర్చుని, పేపర్ వచ్చిన వెంటనే 'వాంటెడ్ కాలమ్స్' చూడడం, ఏవైనా ఉద్యోగ ప్రకటనలు వుంటే, ఆశగా అప్లయి చేయడం, ఇంటర్వ్యూలకి పిలుపు వస్తే వెళ్ళడం, ఉద్యోగం రాకపోవడం నిరాశా, మళ్ళీ ఆశగా పేపర్ చూడడం అలవాటయి, దినచర్యలో ఒక భాగమయిపోయింది.

ఇవాళ 8 గంటలైనా పేపర్‌వాడు రాలేదు. రోజూ 6 గంటలవంగానే, తలుపు కొట్టి పేపర్ ఇచ్చి వెళ్తాడు. నాకంటే వాడే నయం. హాయిగా సంపాదించుకుంటున్నాడు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన నేను ఇటువంటి పనులు చేయలేను. ఎంత ప్రయత్నించినా నాకు తగిన ఉద్యోగం దొరకట్లేదు. ఉద్యోగానికి అప్లయి చేయాలన్నా, డబ్బు కోసం మా నాన్నని అడగాల్సిందే. ఆయనా పెద్ద జీతగాడు కాదు. నా తరువాత పెళ్ళి కావాల్సిన ఆడపిల్లలు నలుగురున్నారు. ఈ వయసులో కుటుంబ బరువు బాధ్యతలు వహించాల్సింది పోయి, ఆయననే అడిగి తీసుకోవడం చాలా సిగ్గుగా ఉంది.

"సార్, పేపర్"

ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి బయటపడి పేపరందుకున్నాను. అలవాటుగా కళ్ళు 'వాంటెడ్ కాలమ్స్' వెంబడి పరిగెట్టాయి. ఓ మూలగా బాక్స్ కట్టిన ప్రకటన నన్నాకర్షించింది. "ఉద్యోగం లేక బాధ పడుతున్నారా? కొత్తగా పెట్టిన మా కంపెనీలో గుమాస్తాలుగా, ఆఫీసర్లుగా పని చేయుటకు ఉత్సాహ వంతులైన యువతీ యువకుల నుండి దరఖాస్తులు కోర బడుతున్నవి. ఇంటర్మీడియెట్, డిగ్రీ చదివినవారు అప్లయి చేయండి. అప్లికేషన్‌తో బాటు రూ. 10 ఎం. ఓ. చేయండి".

ప్రకటన చూడంగానే ఉద్యోగం వచ్చినంత సంబరం వేసింది. మళ్ళీ ఉత్సాహం నీరుగారిపోయింది ట్రూ కాపీల కోసం డబ్బులు, సంతకాల కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణాలు, అక్కడి ఉద్యోగస్తులు చూపే నిరాదరణ గుర్తుకు వచ్చి. కాని వాళ్ళడిగిన అన్ని అర్హతలూ నాకున్నాయి. అప్లయి చేస్తే రాకపోదు.



* * * *

అప్లికేషన్ పెట్టి ఇరవై రోజులు అయింది. ఇంకా జవాబు రాలేదని పడక్కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాను. బయట ఎండ నిప్పులు చెరుగుతోంది అసమర్థుడి కోపంలాగా. మళ్ళీ ఆలోచనల్లోకి జారిపోయాను. పంచరంగుల స్వప్నాలు... ఉద్యోగం వచ్చినట్టూ, కష్టాలు తీరి సుఖంగా ఉన్నట్టూ.

"పోస్ట్"

పోస్ట్‌మన్ కేకతో తెలివి వచ్చింది. అతని కోసం చూస్తే తిరిగి వెళ్ళిపోతూ కనిపించాడు. క్రింద పడిన కవరు తీసి చూశాను. అడ్రస్ నా చేతి రాతే. సందేహంలేదు అది నేను అప్లికేషన్‌లో పంపిన కవరు. చించి చదివాను.

"మిస్టర్ రఘూ,

ఈ దేశంలో మీలాంటివారు చాలామంది ఉన్నారు. మాకు పదివేల అప్లికేషన్స్ వచ్చాయి. ఒకప్పుడు మేమూ మీలాంటి వారమే! ఆకలి, సంసార బాధ్యతలు మమ్మల్ని ఇలాంటి పనికి పురికొల్పాయి. మాకు ఇప్పుడు వచ్చిన మొత్తం డబ్బు లక్ష రూపాయలు. ఈ కంపెనీ ఎత్తేసి మరొక రాష్ట్రంలో పెడతాము. రిపోర్ట్ ఇవ్వడానికి ప్రయత్నించకండి. ఇప్పటికైనా తెలిసింది కదూ డబ్బు ఎలా సంపాదించాలో?"

"........"

సంతకం లేదు కింద. మోసం చేశారు. పిచ్చిగా నవ్వుకున్నాను. నేను పోగొట్టుకుంది పది రూపాయలే! కానీ ఈ దేశంలో కొంతమంది స్త్రీలు తమ శీలాన్ని కూడా పోగొట్టుకుంటున్నారు ఉద్యోగాల కోసం. కాని ఒకటే సందేహం; వాళ్ళు చెప్పినట్టు నేనెప్పటికైనా చేయగలనా అని!